క్లుప్తంగా...

బెస్ట్ హనీ స్టార్టప్ అవార్డు ప్రదానం



అవార్డు అందుకుంటున్న అనుషా రెడ్డి

ఏజీవర్సిటీ: రాజేంద్రనగర్‌లోని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ అగ్రికల్చరల్ ఎక్స్‌టెన్షన్ మేనేజ్‌మెంట్ (మేనేజ్) కు చెందిన భారతీ రెడ్డి ప్రపంచ తేనెటీగల దినోత్సం సందర్భంగా మధ్యప్రదేశ్‌లోని బోజ్ అగ్రికల్చర్ కాలేజీలో కేంద్ర వ్యవసాయ రైతు సంక్షేమ శాఖ మంత్రి శ్రీ నరేంద్రసింగ్ తోమర్ చేతుల మీదుగా బెస్ట్ హనీ స్టార్టప్ అవార్డు అందుకున్నారు. తేనె ఉత్పత్తి, తేనెటీగల పెంపకం రంగంలో విశిష్ట సేవలందించినందుకు గాను ఈ అవార్డును అందుకున్నారు. తెలంగాణ నుంచి అద్భుతమైన విజయం సాధించినందుకు గాను మేనేజ్ డైరెక్టర్ చంద్రశేఖరన్, వ్యవసాయ విస్తరణ డైరెక్టర్ శరవణన్ రాజ్, సిబ్బంది ఆమెను అభినందించారు.

తెలుగు సాహిత్యానికి తీరని లోటు

ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు

రాయదుర్గం: ప్రముఖ కథారచయిత, అధ్యాపకులు, కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత ఆచార్య కేతు విశ్వనాథరెడ్డి మృతితో తెలుగు సమాజం ఉత్తమ విద్యావేత్త, కథారచయితను కోల్పోయిందని హెచ్‌సీయూ తెలుగు శాఖ అధ్యక్షులు ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. సోమవారం ఆయన ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. ఆయన సుదీర్ఘకాలం పాటు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయంలో పనిచేశారని గుర్తు చేశారు. ఆ సమయంలో బీఏ, ఎంఏ తెలుగు విద్యార్థులకు ఎన్నో ఉత్తమమైన పాఠ్యాంశాలను రూపకల్పన చేశారన్నారు. ఆయన అనేక కథలు రాశారని, జప్తు, ఇచ్ఛాగ్ని, కేతు విశ్వనాథరెడ్డి కథలు పేర్లతో కథా సంపుటాలుగా కూడా ఆయన కథలు వెలువడ్డాయన్నారు. ఆయన మరణం తెలుగు సాహిత్య లోకానికి తీరని లోటని పేర్కొన్నారు.

ఉల్లాసంగా.. ఉత్సాహంగా..



గోల్కొండ: వేసవి శిబిరాలను చిన్నారులు సద్వినియోగం చేసుకున్నారు. జనహిత్ చారిటబుల్ ట్రస్ట్, పీఎంఎల్ ఫౌండేషన్ వారు సంయుక్త ఆధ్వర్యంలో గుడిమల్కాపూర్‌లో నిర్వహించిన వేసవి శిక్షణ శిబిరం సోమవారం ముగిసింది. ఈ సందర్భంగా బాలబాలికలు వేర్వేరుగా తాము నేర్చుకున్న విషయాలను ఎంతో చక్కగా ప్రదర్శించారు. తాము నేర్చుకున్న భాషా ప్రావిణ్యంతో ఉపన్యాసం ఇస్తూ అందరినీ ఆకట్టుకున్నారు. నిష్ణాతులైన డ్యాన్సర్ల మాదిరిగా నృత్యం చేస్తూ శభాష్ అనిపించుకున్నారు. తమ తండ్రి గుడిమల్కాపూర్ కార్పొరేటర్ దివంగత దేవర కరుణాకర్ స్థాపించిన జనహిత్ ట్రస్ట్ సేవాకార్యక్రమల్లో భాగంగా చిన్నారుల కోసం ఈ వేసవి క్యాంపు నిర్వహించామని, సంవత్సరం పొడవునా సేవా కార్యక్రమాలు కొనసాగిస్తామని బీజేపీ నాయకులు దేవర వంశీ తెలిపారు.

వృత్తిపని వారికి ఆలయ కమిటీలో సభ్యత్వం కల్పించాలి



దేవాదాయశాఖ ఇన్‌స్పెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

గోల్కొండ: గోల్కొండ జగదాంబిక మహంకాళి అమ్మవారి బోనాల నిర్వహణ కమిటీలో తమకు సభ్యత్వం కల్పించాలని అమ్మవారి వృత్తిపని సంఘం అధ్యక్షుడు బొమ్మల సాయిబాబాచారి అన్నారు. ఈ మేరకు ఆయన సోమవారం వృత్తిపని సంఘం వారితో కలిసి రాష్ట్ర దేవాదాయా, ధర్మాదాయ ఇన్‌స్పెక్టర్ సురేందర్‌కు వినతిపత్రం సమర్పించారు. తరతరాలుగా తాము అమ్మవారికి సేవ చేస్తూ వస్తున్నామని ఆ వినతి పత్రంలో పేర్కొన్నారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత బోనాలు రాష్ట్ర పండుగగా గుర్తించబడ్డాయని, దీనివల్ల బోనాలను భారీ ఎత్తున నిర్వహించడం జరుగుతుందన్నారు. బోనాల ఏర్పాట్లు, అమ్మవారి సేవలలో వివిధ రకాల కులస్తులు బోనాలను విజయవంతం చేయడానికి ఆలయ కార్యనిర్వహణాధికారి ఆదేశాలకు అనుగుణంగా పని చేస్తున్నారన్నారు. అంతేకాకుండా మొట్టమొదటి సారిగా తెలంగాణ ప్రభుత్వం తమ సేవలను గుర్తించి యూనిఫాం, గుర్తింపు కార్డులు ఇవ్వడమే కాకుండా తమ సేవలకు గాను గౌరవం భత్యం కూడా ఇవ్వడం జరుగుతుందన్నారు. బోనాల నిర్వహణ కమిటీలో తమలో ఒకరిని కమి టీ చైర్మన్, సభ్యుడిగా నియమించాలని కోరారు. వినతిపత్రం సమర్పించిన వారిలో శ్రీకాంత్‌చారి, రామకృష్ణ, నర్సింహులు తదితరులున్నారు.

భళా.. విద్యార్థుల కళ


















విద్యార్థుల కళాసృష్టి భళా అనేలా.. అందరినీ ఇట్టే ఆకట్టుకునే రీతిలో కళాకృతులను తయారు చేసి ప్రదర్శనలో ఉంచారు. గచ్చిబౌలిలోని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్శిటీలోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్, ఎస్ఎన్ స్కూల్ ఆఫ్ ఆర్ట్స్ అండ్ కమ్యూనికేషన్‌లోని మాస్టర్స్ ఇన్ ఫైన్ ఆర్ట్స్ (ఎంఎఫ్ఏ) ఫైనల్ ఇయర్ విద్యార్థులు తయారు చేసిన వివిధ కళాఖండాలతో వార్షిక ప్రదర్శనను నిర్వహించారు. ఈ ప్రదర్శనలో 23 మంది విద్యార్థులు తయారు చేసిన కళాత్మక ఆకృతులను ప్రదర్శించారు. 2వేల మంది సందర్శకులు కూడా వీక్షించారు. ప్రముఖ ఆర్టిస్ట్ డీఎల్ఎన్‌రెడ్డిని గౌరవించారు.

– రాయదుర్గం

కల్యాణం..కమనీయం..

వైభవంగా మంచిరేవుల వేణుగోపాల స్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు



స్వామి వారి కల్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు



స్వామి వారి మూలవిరాట్టుకు అభిషేకం నిర్వహిస్తున్న దృశ్యం

మణికొండ: రుక్మిణీ సత్యభామ సమేతం శ్రీ వేణుగోపాలస్వామి కల్యాణం సోమవారం రాత్రి కనుల పండవగా రాత్రి జరిగింది. నార్సింగి మున్సిపాలిటీ, మంచిరేవుల గ్రామంలోని శ్రీ వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాలలో భాగంగా సోమవారం ఉదయం స్వామి వారి మూలవిరాట్టుకు అష్టోత్తర శతకలషాభిషేకం, హారతి నిర్వహించారు. సాయంత్రం 5గంటలకు గరుడ వాహన సేవ, ఎదుర్కోళ్లు, రాత్రికి స్వామి వారి కల్యాణం నిర్వహించారు. డ్రీమ్ వ్యాలీ రిసార్ట్స్ చైర్మన్ సంతోష్‌రెడ్డి దంపతుల నేతృత్వంలో బ్రహ్మోత్సవాలను నిర్వహిస్తున్నారు. సోమవారం జరిగిన కల్యాణోత్సవంలో వారు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు గూడా నర్సింహాచార్యులతో పాటు దేవాలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ పొన్న రమేష్‌తో పాటు వేద పండితులు, గ్రామస్తులు, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

కేశవ్‌నగర్‌లో బీజేపీ నేతల పర్యటన



పనులను పరిశీలిస్తున్న బీజేపీ నాయకులు

రాజేంద్రనగర్: అత్తాపూర్ డివిజన్ హైదరాబాద్ గూడ కేశవ్‌నగర్ కాలనీలో సోమవారం డివిజన్ బీజేపీ అధ్యక్షులు షాబాద్ విజయ్ కుమార్ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు పర్యటించారు. స్థానికులు డ్రైనేజీ, మంచినీరు, పారిశుధ్యం తదితర సమస్యలను వారి దృష్టికి తీసుకువచ్చారు. ప్రధానంగా డ్రైనేజీ మ్యాన్‌హోల్ ప్రమాదభరితంగా మారాయని చెప్పడంతో జలమండలి మేనేజర్ శ్రావ్యకు ఫిర్యాదు చేశారు. ఆమె వెంటనే స్పందించి కాలనీలో ప్రమాదకరంగా మారిన డ్రైనేజీ పనులను చేపట్టాలని సిబ్బందిని ఆదేశించడంతో సాయంత్రం పనులను పూర్తి చేశారు. ఈ సందర్భంగా స్థానికులు బీజేపీ నాయకులతో పాటు జలమండలి అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా కార్యవర్గ సభ్యులు మూల శ్రీనివాస్ గౌడ్, కాకుళారం కృష్ణ, డివిజన్ ప్రధాన కార్యదర్శులు సాయి యాదవ్, రాజు పహిల్వాన్, విజయ్ రావూత్, శ్యామ్ సింగ్, దండోలు యాదగిరి, నాగరాజు, బస్తీవాసులు పాల్గొన్నారు.

చిరు ధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యం

ఈపీటీఆర్ఐ డీజీ వాణి ప్రసాద్

గచ్చిబౌలి: చిరు ధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని ఈపీటీఆర్ఐ డైరెక్టర్ జనరల్ వాణిప్రసాద్ పేర్కొన్నారు. సోమవారం గచ్చిబౌలిలోని ఈపీటీఆర్ఐ (ఎన్విరాన్‌మెంట్ ప్రొటెక్షన్ ట్రెనింగ్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్)లో అంతర్జాతీయ జీవ వైవిధ్య దినోత్సవాన్ని పురస్కరించుకొని 'ఏ స్టెప్ టు వర్డ్స్ సస్టెయినబుల్ ఆగ్రో బయోడైవర్సిటీ' అనే అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వాణి ప్రసాద్ మాట్లాడుతూ వివిధ రకాల పంటల జాతులు ఉండగా కొన్ని రకాలకు మాత్రమే అలవాటు పడటంతో మిగతా వాటి సాగు నానాటికీ తగ్గిపోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఆరోగ్యానికి, మిల్లెట్స్ ఉన్న సంబంధంపై విస్తృత అవగాహన కల్పించడంతో చిరుధాన్యాలకు ప్రాధాన్యత లభించిందన్నారు. జీవన శైలిలో మార్పులు అవసరమని, ఆహారంగా చిరుధాన్యాలు తీసుకుంటే రోగ నిరోధక శక్తి పెరిగి అనారోగ్యం దరి చేరదని ఆమె పేర్కొన్నారు. జీవ వైవిధ్య వ్యవసాయాన్ని ప్రోత్సహించేందుకు ఈపీటీఆర్ఐ కృషి చేస్తుందన్నారు. అనంతరం చిరు ధాన్యాల ప్రదర్శన, మిల్లెట్ భోజనం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఈపీటీఆర్ఐ హెచ్ఓడీ డాక్టర్ సునీల, డాక్టర్ వీరాంజనేయులు, డాక్టర్ జ్యోతి పాల్గొన్నారు.



అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న ఈపీటీఆర్ఐ డైరెక్టర్ జనరల్ వాణిప్రసాద్

రెజ్లింగ్ పోటీల్లో పాల్గొనండి

బండ్లగూడ: సీఎం కప్ జిల్లా స్థాయి రెజ్లింగ్ పోటీలను జిల్లా క్రీడా సాధికారిక సంస్థ ఈనెల 24న గచ్చిబౌలి స్టేడియంలో నిర్వహిస్తుందని, గండిపేట మండల పరిధిలోని రెజ్లర్లు ఈ పోటీల్లో పాల్గొని ప్రతిభ చూపాలని బండ్లగూడ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ వేణుగోపాల్‌రెడ్డి అన్నారు. మరిన్ని వివరాలకు 9121106503 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

బస్‌పాస్‌లకు దరఖాస్తు చేసుకోండి

మణికొండ: దివ్యాంగులు, వారి సహాయకులకు ఆర్టీసీ రాయితీతో కూడిన బస్‌పాస్‌లను అందిస్తుందని, అవసరమైన వారు మణికొండ, నార్సింగి మున్సిపాలిటీ కార్యాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని ఆర్టీసీ అధికారులు కోరారు. బస్‌పాస్‌లు తీసుకునేందుకు కలర్ పాస్ ఫొటో, సదరం ధృవీకరణ పత్రం, ఆధార్ కార్డు జిరాక్స్ పత్రాలతో పాటు రూ.50 చెల్లించాలన్నారు. వాటిని పరిశీలించి తమ సిబ్బంది ఇంటికి వచ్చి బస్‌పాస్‌లను అందజేస్తారన్నారు. రెండు మున్సిపాలిటీల పరిధిలోని దివ్యాంగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని నార్సింగి మున్సిపల్ వైస్ చైర్మన్ జి.వెంకటేశ్‌యాదవ్, మణికొండ మున్సిపాలిటీ వైస్ చైర్మన్ కె.నరేందర్‌రెడ్డి సూచించారు.

పీఏసీఎస్ చైర్మన్ సంజీవరెడ్డి రాజీనామా

మణికొండ: నార్సింగి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం(పీఏసీఎస్) చైర్మన్ పి. సంజీవరెడ్డి రాజీనామా చేశారు. సోమవారం ఆయన ఈ విషయాన్ని జిల్లా కమిషనర్‌కు మెయిల్ చేశారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ తమ కమిటీ ఎన్నికయినప్పటి నుంచి ఇప్పటి వరకు తనకు ఎలాంటి రికార్డులను అధికారులు అందజేయలేదన్నారు. ఆ విషయం తెలిసినా సంస్థ ఆడిటర్ తనను రికార్డులు అడుగుతున్నారన్నారు. తనకు రికార్డులు ఇవ్వని విషయాన్ని లేఖ రూపంలో స్పష్టం చేశారన్నారు. తన రాజీనామాను ఆమోదించాలని జిల్లా అధికారిని కోరినట్లు తెలిపారు.

ముగిసిన క్రీడా, సాంస్కృతిక పోటీలు



రాయదుర్గం: మనూలో జీ–20 యూనివర్సిటీ కనెక్ట్ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన క్రీడా పోటీలు ముగిశాయి. డైరెక్టరేట్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్, స్పోర్ట్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఇంటర్ హాస్టళ్ల పోటీల్లో బాలుర హాస్టల్స్–2 క్రికెట్ విజేతగా నిలిచింది. బ్యాడ్మింటన్ సింగిల్స్‌లో బీహెచ్–4, బ్యాడ్మింటన్ డబుల్స్ బీహెచ్–1 గెలుచుకుంది. వాలీబాల్, ఫుట్‌బాల్, టేబుల్ టెన్నిస్‌లో బాయ్స్ హాస్టల్–2 విజేతగా నిలిచింది. క్యారమ్స్ సింగిల్స్, డబుల్స్ విజేతగా కూడా హాస్టల్–2 గెలుచుకుంది. కాగా చెస్ పోటీలో ఎం.డీ అర్సలాన్ విజేతగా, బైట్‌బాజీలో హాస్టల్–2 , క్విజ్‌లో బాలుర హాస్టల్–3 విజేతగా నిలిచింది.

భక్తి శ్రద్ధలతో హనుమాన్ ఆలయ వార్షికోత్సవం



పూజా కార్యక్రమాల్లో పాల్గొన్న భక్తులు

శంషాబాద్: పట్టణంలోని గొల్లపల్లి హనుమాన్ సమేత ఇష్ట కామేశ్వరి, కాశీవిశ్వేర దేవాలయ అష్టమ వార్షికోత్సవ పూజలు సోమవారం ముగిశాయి. చివరి రోజు భక్తులు పెద్ద సంఖ్యలో స్వామివారి దర్శనం చేసుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. గోమాత పూజ, అవాహిత దేవతార్చన, మహాచండి హననం, నవగ్రహ హోమం, మహా పూర్ణాహుతి, శివపార్వతుల శాంతి కల్యాణం, బలిహరణం, అవభృథం, మహాదాశీర్వచనం, వేద పండితుల సత్కారం, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. పూజా కార్యక్రమాల్లో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కె. చంద్రారెడ్డి, మాజీ సర్పంచ్ జిట్ట సిద్దులు దంపతులు, నర్సింహారెడి, చంద్రాచారి, యాదయ్య, వెంకటేష్‌గౌడ్, పాండు,బాబు, భిక్షపతి, బాలయ్య, రాముచారి, నరేందర్, భాస్కర్, బాల్‌రెడ్డి, బాల్‌రాజ్‌గౌడ్, నవీన్, నర్సింహా, దశరథ్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధికి ఆమడదూరంలో తొండుపల్లి



మాట్లాడుతున్న ఓబీసీ మోర్చా కార్యదర్శి కుమార్

శంషాబాద్: మున్సిపాలిటీలోని తొండుపల్లి 10వ వార్డు మూడున్నరేళ్లుగా అభివృద్ధికి నోచుకోలేదని పట్టణ ఓబీసీ మోర్చా కార్యదర్శి కుమార్ ఆరోపించారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రూ. కోట్లల్లో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని ప్రకటిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్, స్థానిక కౌన్సిలర్లు క్షేత్ర స్థాయిలో చూపించాలని డిమాండ్ చేశారు. గ్రామ పంచాయతీల్లో జరిగిన అభివృద్ధి కూడా జరగడం లేదన్నారు. కౌన్సిలర్ స్థానంలో ఆమె కుమారుడు పెత్తనం చేస్తున్నారని ఆరోపించారు. దీంతో అభివృద్ధి పూర్తిగా కుంటుపడిపోయిందన్నారు. దీనిపై చర్చకు బీజేపీ సిద్ధంగా ఉందన్నారు. కార్యక్రమంలో బీజేపీ నేతలు ఇంజమూరి శ్రీకాంత్‌గౌడ్, అనిల్‌కుమార్, గణేష్, హరి తదితరులు పాల్గొన్నారు.

మున్సిపాలిటీ రెవెన్యూ విభాగంపై ఆడిట్ జరిపించాలి



వివరాలు వెల్లడిస్తున్న సంజయ్ యాదవ్ తదితరులు

శంషాబాద్: శంషాబాద్ మున్సిపాలిటీ రెవెన్యూ విభాగంలో భారీ కుంభకోణం చోటు చేసుకుందని పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు, కౌన్సిలర్ సంజయ్‌యాదవ్ ఆరోపించారు. ఇందుకు సంబంధించి పూర్తి ఆధారాలున్నాయని వెంటనే ఆడిట్ జరిపించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ మున్సిపాలిటీకి ఏకైక ఆదాయవనరైన ఆస్తిపన్ను ముదింపులో భారీగా అక్రమాలు చోటు చేసుకున్నాయన్నారు. పట్టణంలోని ప్రధాన చౌరస్తా నుంచి జాతీయ రహదారికి ఇరువైపులా ఉన్న వాణిజ్య సముదాయాల ఆస్తిపన్ను ముదింపులో ప్రభుత్వ భూమి విలువను భారీగా తగ్గించారన్నారు. ప్రభుత్వ పరంగా భూమి విలువ గజం రూ. 26.700 ఉండగా దానిని రూ.6.700కు తగ్గించారని, అంతేగాక ఆస్తిపన్ను ముదింపులో ఒక్కో వాణిజ్య సముదాయానికి వేలు, లక్షల్లో తగ్గించారన్నారు. గత మున్సిపల్ కమిషనర్‌తో పాటు రెవెన్యూ విభాగం అధికారులు, ప్రజాప్రతినిధుల సహకారంతో ఈ అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపించారు. ఈ విషయమై జిల్లా జాయింట్ కలెక్టర్‌కు సైతం పూర్తి వివరాలను వివరించి వినతి పత్రం అందజేశామన్నారు. డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అధికారులు వెంటనే ప్రత్యేక ఆడిట్ చేయించి వాస్తవాలను ప్రజలకు వివరించాలన్నారు. తమ వద్ద ఉన్న ఆధారాలను జిల్లా కలెక్టర్, మున్సిపల్ శాఖ ఉన్నతాధికారులకు అందజేయనున్నట్లు తెలిపారు. సమావేశంలో పీసీసీ ఎస్సీసెల్ ఉపాధ్యక్షుడు జల్లపల్లి నరేందర్ , పట్టణ ఉపాధ్యక్షుడు శేఖర్ గుప్తా, నజీరుద్దీన్, అశోక్, ఇమ్రాన్, చందు యాదవ్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలంలో అక్రమ నిర్మాణాల కూల్చివేత



అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తున్న అధికారులు

రాజేంద్రనగర్: మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ కాటేదాన్ టీఎన్‌జీఓస్ కాలనీ ప్రాంతంలోని ప్రభుత్వ స్థలంలో నిర్మించిన ప్రహరీలతో పాటు నిర్మాణాలను సోమవారం రెవెన్యూ అధికారులు కూల్చివేశారు. టీఎన్‌జీఓస్ కాలనీ ప్రాంతంలోని సర్వే నంబర్ 150/1లో ప్రభుత్వ స్థలంలో కొందరు వ్యక్తులు అక్రమంగా ప్రహరీలతో పాటు గదులను నిర్మించారు. స్థానిక బీజేపీ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి ఫిర్యాదు స్పందించిన రాజేంద్రనగర్ తహసీల్దార్ చంద్రశేఖర్, ఆర్ఐ సారిక ఆధ్వర్యంలో స్థలాన్ని పరిశీలించారు. సోమవారం ఉదయం అక్రమ నిర్మాణాలను కూల్చివేయించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ... ప్రభుత్వ స్థలంలో నిర్మాణాలను చేపడితే సహించేది లేదన్నారు. ప్రస్తుతం 150/1 సర్వే నంబర్‌లో నిర్మించిన నిర్మాణాలను కూల్చివేశామని.. మరోసారి ఇలాంటి చర్యలకు పాల్పడితే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ కార్పొరేటర్ సంగీత గౌరీ శంకర్

రాజేంద్రనగర్: అత్తాపూర్ డివిజన్ పాండురంగానగర్‌లో రూ. 9 లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్డు పనులను సోమవారం కార్పొరేటర్ సంగీత గౌరీ శంకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. జీహెచ్ఎంసీ అత్తాపూర్ డివిజన్‌కు రావాల్సిన నిధులను మంజూరు చేయడంలో జాప్యం చేస్తుందన్నారు. కౌన్సిల్ సమావేశంలో ఈ విషయాన్ని ప్రస్తావించేందుకు తాను సిద్ధమవుతుండగా... కౌన్సిల్ సమావేశాన్ని వాయిదా వేశారని ఆరోపించారు. పాండురంగానగర్‌లో సీసీ రోడ్డు శిథిలావస్థకు చేరడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులకు ఎదుర్కొంటున్నారన్నారు. జీహెచ్ఎంసీ అధికారులతో మాట్లాడి రూ.9 లక్షలు మంజూరు చేయించినట్లు తెలిపారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ అసిస్టెంట్ ఇంజినీర్ నరసింహమూర్తి, వర్క్ ఇన్‌స్పెక్టర్ వీరారెడ్డి, బీజేపీ నాయకులు బీట్యాకరి సిద్దేశ్వర్, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

బైక్ దొంగలకు రిమాండ్

రాజేంద్రనగర్: బైక్‌పై వెళుతున్న వారిపై దాడి చేసి వాహనంతో పరారైన ఇద్దరు నిందితులను రాజేంద్రనగర్ పోలీసులు సోమవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. వారి నుంచి పల్సర్ వాహనంతో పాటు యాక్టివాను స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.. రాజేంద్రనగర్ హైదర్‌గూడ ప్రాంతంలోని సమిష్టి బార్ అండ్ రెస్టారెంట్‌లో సూపర్‌వైజర్‌గా పని చేస్తున్న షేక్ సదుల్ ఈ నెల 14న రాత్రి బార్ మూసివేసిన అనంతరం బార్‌లో పని చేస్తున్న మణెమ్మ అనే మహిళను గోల్డెన్ హట్స్ ప్రాంతంలోని ఆమె ఇంటి వద్ద విడిచి పెట్టేందుకు బైక్‌పై బయలుదేరాడు. గోల్డెన్ హట్స్ ఆడమ్ స్కూల్ వద్దకు రాగానే బాలాపూర్ షాహీనగర్‌కు చెందిన మహ్మద్ తాహా, నాంపల్లి సుల్తాన్‌బజార్‌కు చెందిన ముజుతాబా హుస్సేన్ వారిని అడ్డుకుని వివరాలు అడిగారు. రాత్రి వేళల్లో ఎక్కడ వెళుతున్నావ్ అంటూ అతడిపై దాడి చేశారు. బైక్ లాక్కుని అదే వాహనంపై అక్కడి నుంచి పరారయ్యారు. షేక్ సదుల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన రాజేంద్రనగర్ పోలీసులు సోమవారం ఉదయం ఆరాంఘర్ ప్రాంతంలో నిందితులను అదుపులోకి తీసుకున్నారు. వీరి నుంచి పల్సర్ వాహనంతో పాటు మరో యాక్టివా వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. నిందితులిద్దరిపై నగరంలోని పలు పోలీస్‌స్టేషన్లలో కేసులు ఉన్నాయని... వాటి వివరాలు సేకరిస్తున్నట్లు తెలిపారు.

పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ పాటుపడాలి



కార్యక్రమంలో ఎంటమాలజీ ఏఈ ఖయ్యూం, బస్తీ నాయకుడు రాజు తదితరులు

గోల్కొండ: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని ఎంటమాలజీ విభాగం ఏఈ మహ్మద్ ఖయ్యూం అన్నారు. సోమవారం ఆయన షేక్‌పేట్‌లో పర్యావరణ హిత జీవనశైలిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. షేక్‌పేట్ వినాయక కాలనీలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. నేడు పర్యావరణ పరిరక్షణ అత్యంత ప్రధానమైందన్నారు. పర్యావరణ పరిరక్షణలో బస్తీ సంక్షేమ సంఘాలు, యువజన సంఘాలు పాల్గొనాలని ఆయన సూచించారు. బల్దియా వారు ఏర్పాటు చేస్తున్న చెత్త డబ్బాల్లోనే చెత్తను వేయాలని, తడి, పొడి చెత్తను విభజించి వాటికి కేటాయించిన డబ్బాల్లోనే వాటిని వేయాలని ఆయన అన్నారు. అదే విధంగా నీరు ఎంతో అమూల్యమైందని, ప్రతి చుక్కను ఒడిసి పట్టుకునేందుకు ఇంకుడు గుంతను ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ నాయకుడు చింతకుంట్ల రాజు తదితరులు పాల్గొన్నారు.